


*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మాట్లాడండి మనసారా!!

" ఇదేం బోర్డ్ శ్రేయస్? మీ ఫోన్ మాకివ్వండి, మేమిచ్చే డిస్కవుంట్ తీసుకోండి!! -అని రాసుందే? అంటే ఏమిటి? నాకేం అర్థం కాలేదు " నవ్వుతూ అడిగింది నవ్య.

" అవును! ఇప్పుడు నీకు తెలీదు, కొన్ని రోజుల్లోనే తెలుస్తుంది చూడు" అన్నాడు శ్రేయస్.

"ఎలా?" అంది నవ్య అనుమానంగా.

"మనలో మనకే తెలియని కొన్ని భావాలు, ఎమోషన్స్ ఉంటాయి, వాటిని మనం ఒక్కసారి కదిలించగలిగితే చాలు, మనుషులు తమని తాము కాకపోయినా తమకి కావలసినదేమిటో తెలుసుకుంటారు. అదీ నా విశ్వాసం. మన బిజినెస్ పెరగడం అప్పుడు పూర్తిగా ఇన్సిడెంటల్ అవుతుంది. ఎంతో బాగా నడుస్తుంది. అయినా ఈ బోర్డ్ వెనకున్నది కేవలం బిజినెస్ మాత్రమే కాదు. నన్ను నమ్ము, ఇది మనకీ, మన కస్టమర్లకీ కూడా మంచిది!" అన్నాడు శ్రేయస్.

భుజాలెగరేసింది నవ్య 'చూద్దాం!' అన్నట్టుగా..

శ్రేయస్, నవ్యా, భువన్ ముగ్గురూ కలిసి భాగస్వాములుగా కలిసి కొత్తగా రెస్టారెంట్ వ్యాపారం మొదలు పెట్టబోతున్నారు. మరో మూడురోజుల్లో దాని ప్రారంభోత్సవం అనుకున్నారు. కొద్దిగా విభిన్నంగా ఉండాలని ఎన్నో ఆలోచనలు చేశారు.

లోపల అలంకరణ, ప్లేట్ లూ, గ్లాస్ లు, పిల్లలకి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఇలా ఎన్నో ప్రత్యేకమైన విషయాలని ఆలోచించారు. ఇంటీరియర్ డిజై నింగ్ ని ఎంతగానో ఇష్ట పడే అయిన నవ్య దగ్గరుండి అన్నీ పర్యవేక్షించింది.

భువన్, శ్రేయస్ మార్కెటింగ్, షెఫ్ లని ఇతర సిబ్బంది నియామకాలని చూసుకున్నారు. తమ రెస్టారెంట్ లో ఎలాంటి ఆహారం ఉండాలి? ఎలాంటి ఆఫర్లు ఇవ్వచ్చు? లాంటి విషయాలన్నీ ముగ్గురూ కలిసి నిర్ణయించారు.

మధ్యలో కొన్ని టెన్షన్స్, ఒడిదుడుకులూ ఎదురయినా మొత్తానికి ముగ్గురూ కలిసి అన్నింటినీ అధిగమించి ప్రారంభోత్సవం దాకా తీసుకురాగలిగారు. మరో రెండు రోజుల్లో ప్రారంభోత్సవం, దానికన్ని ఏర్పాట్లూ చేసుకుంటూ ఉండగా హఠాత్తుగా శ్రేయస్ ఈ బోర్డ్ రాయించి తీసుకొచ్చాడు. అది చూసి నవ్య ఆశ్చర్యపోయింది. అతను చెప్పిన వివరణ కూడా ఆమెని పూర్తిగా తృప్తి పరచలేకపోయింది.

' ఇప్పుడతనితో వాదన ఎందుకు? భువన్ వచ్చాకా ఒకే సారి అడిగి తెలుసుకోవచ్చులే! 'అనుకుని అప్పటికి ఊరుకుంది.

ఆ బోర్డ్ ని ఎక్కడ తగిలిస్తే అందరికీ బాగా కనిపిస్తుంది? ఎలా అందరి చూపులనీ ఆకట్టుకోవాలి? అన్న విషయం ఆలోచిస్తున్నాడు శ్రేయస్.

నవ్య కిచెన్ లోకి వెళ్ళి అక్కడున్న పరికరాలన్నింటినీ పరీక్షించి వచ్చింది. నేప్కిన్స్, ప్లేట్స్ లాంటి వస్తువుల డిజైన్ లన్నీ మరో సారి పరీక్షించి అన్నీ తాము అనుకున్నట్టే ఉన్నాయని తృప్తి చెందింది. రెండు కప్పుల్లో వేడి నీళ్ళు, వాటిలో సుగంధభరితమైన టీ బాగ్ లు వేసుకుని వచ్చింది. శ్రేయస్ కి ఒకటి ఇచ్చి తను మరొకటి తీసుకుని అతని ఎదురుగా కూర్చుంది.

శ్రేయస్ ఏదో ఆలోచనల్లో ఉండిపోయాడు. అతని ఆలోచనలని భంగపరచడం ఇష్టం లేక నవ్య నెమ్మదిగా టీ తాగుతూ కూర్చుంది. మరో రెండు నిమిషాలకి భువన్ వచ్చాడు.

" వాట్సప్ గైస్" అంటూ.. "ఓ టీ! వావ్!" అంటూ శ్రేయస్ కోసం పెట్టిన కప్ తను తీసుకుని తాగడం మొదలు పెట్టాడు.

" అరే, అది శ్రేయస్ కోసం పెట్టాను, నీకు మళ్ళీ తెద్దాం" అంది నవ్య..

" దట్స్ ఓకే!" అన్నాడు శ్రేయస్.

" ఏం చేస్తున్నావు శ్రే? ఇదేంటి?" అడిగాడు శ్రేయస్ వైపు చూస్తూ.

" నేనొకసారి అడిగి ఎటూ అర్థం కాని ఒక జవాబు విన్నాను. నువ్వు కూడా విని తరించు" అంది నవ్య అల్లరిగా.

భువన్ కూడా శ్రేయస్ రాయించిన బోర్డ్ చూసి గమ్మత్తుగా భుజాలెగరేస్తూ అడిగాడు. " వాటీజ్ దిస్ బ్రో?" అని.

“కొత్త వ్యాపార ప్రణాళిక” అంది నవ్య నవ్వుతూ.

" ఇంటరెస్టింగ్, కొంచం వివరంగా చెప్పు గురూ! వ్యాపార ప్రణాళిక అంటే విని తీరాల్సిందే!" అన్నాడు సరదాగా.

శ్రేయస్ నవ్వలేదు. " ఇందులో నవ్వడానికేమీ లేదు ఫ్రెండ్స్! దిస్ ఈజ్ ఏ సీరియస్ మేటర్ అండ్ ఐ యాం వెరీ సీరియస్ అబవుట్ ఇట్. “ అన్నాడు సీరియస్ గా..

ఎప్పుడూ తమతో నవ్వుతూ, నవ్విస్తూ ఉండే అతనిలో కనిపిస్తున్న మార్పుని అతని సన్నిహితులైన వారిద్దరూ క్షణంలో కనిపెట్టారు.

" శ్రేయస్! ఎనీ ప్రాబ్లెం? ఆర్ యూ ఓకే? నీకిష్టం లేకపోతే తర్వాత మాట్లాడదాం. బోర్డ్ ఆసక్తిగా ఉందని అడిగాను" అన్నాడు భువన్.

“యా, ఐ యాం ఓ కే, యా, బోర్డ్ ఇంటరెస్టింగ్ లేదా ఫన్నీ గా ఉండచ్చు. ఈ ఐడియా నా స్వంతం కాదు,నేను కూడా నెట్ లో చదివి తెలుసుకున్నది. అది మొదటి సారి చదివినప్పటినించీ నాకెందుకో అలాంటిది మన రెస్టారెంట్ లో కూడా అమలు చేస్తే బావుంటుంది అనిపించింది. దానివెనకున్న కారణాలు చాలా ఉన్నాయి, నా స్వంత వాటితో సహా" అంటూ ఆగాడు స్నేహితుల ముఖాల్లోకి చూస్తూ..

" ముందు ఐడియా ఏవిటో చెప్పు!ఇప్పటికే చాలా సస్పెన్స్ అయింది" అంది నవ్య..

" అరే! అవునా? అర్థం అయిపోయి ఉండాలి అనుకున్నానే! వెరీ సింపుల్. మన రెస్టారెంట్ కి వచ్చేవాళ్ళందరికీ టేబిల్ చూపించగానే చిన్న తాటాకు బుట్ట, ఇదిగో రంగు రంగులలో దొరికే ఇలాంటి చిన్నవన్నమాట. ఇవి ఇచ్చి, దాంట్లో వాళ్ళ సెల్ ఫోన్ లు వెయ్యమని అడుగుతాం. అలా వేసి, ఇక్కడ భోజనం చేస్తున్నంత సేపూ ఫోన్ లో కాకుండా కేవలం తమతో వచ్చినవారితో, అది కుటుంబ సభ్యులైనా, స్నేహితులైనా మరెవరైనా సరే, మాత్రమే మాట్లాడుతూ హాయిగా, ఆనందంగా భోజనం చేసిన వారికి చిన్న డిస్కవుంట్ ఇస్తాం మనం. అది ఎంత అనేది మనం కలిసి నిర్ణయిద్దాం వాళ్ళకి వడ్డించిన వెయిటర్ వాళ్ళు వెళ్ళేముందు ఆ ఫోన్ లు వాళ్ళకి తిరిగి ఇచ్చేస్తాడు. దానితో పాటు ఒక చాక్లెట్, చిన్న థాంక్ యూ నోట్ ఇస్తాం. ఇదీ నా ఆలోచన!" అన్నాడు.

ఒక్క క్షణం శ్రోతలిద్దరూ మాట్లాడలేదు. మొదటగా నవ్యే అంది.

" ఇంపాజిబుల్! ఎవరూ ఇవ్వరు చూస్తూ ఉండు! ఈ బిజీ యుగంలో ఫోన్ లేకుండా జనం క్షణం గడపలేకపోతున్నారే? అలాంటిది భోజనానికి కనీసం నలభై ఐదు నిమిషాల నించీ, గంట లేదా అంతకన్నా ఎక్కువ పట్టచ్చు. అంతసేపు ఫోన్ లేకుండా ఉండడానికి ఎవరూ ఇష్టపడరు. ఇష్టం మాట అలా ఉంచితే నిజమగానె ముఖ్యమైన కాల్స్ వచ్చేవి ఉంటాయి కదా! వారి సంగతేమిటి? అయినా వాళ్ళ ఫోన్లు, వాళ్ళిష్టం. మధ్యలో మన బలవంతమేమిటి? ఎందుకు? నాకేమీ అర్థం కాలేదు" అంది నవ్య గబ గబా.

" ఐ అగ్రీ.. కానీ కొంతవరకూనే. దీనిలో అందరూ పాల్గొనాలని రూలేమీ లేదుగా. తమ ఇష్టంతో ఫోన్ లు ఇచ్చిన వారికి డిస్కవుంట్ ఇస్తాం, లేని వారికి లేదు. అది కాదు నా పాయింట్. అసలీ ఆలోచన ఎలా వచ్చింది? ఎందుకు నచ్చింది?" అన్నాడు భువన్.

మీ ఇద్దరి వాదనల్లోనూ నిజాలున్నాయి. మొదట నీ మాట నవ్యా, " నెలకో, పదిహేను రోజులకో కుటుంబ సభ్యులతో కలిసి గడపడానికి వచ్చే సమయం ఎంత విలువైనదో ప్రజలు గుర్తించలేరా? ఆ మాత్రం కూడా గడపలేని వారెందుకు రావడం చెప్పు?

నీకు గుర్తుందా? మన రెస్టారెంట్ ప్లాన్ చేసే ముందు మనం ఎన్ని రెస్టారెంట్ లకి వెళ్ళి వివరాలు సేకరించామో!

వెళ్ళిన ప్రతీ చోటా నాకు కనిపించినది ఒకటే. కావలసినవి ఆర్డర్ ఇచ్చి, అవి వచ్చేవరకూ, తింటూ.. తినేసాకా బిల్ వచ్చేవరకూ.. చివరికి బయటకు నడుస్తూ కూడా ఎవరి ఫోనుల్లోకి వాళ్ళూ కళ్ళూ, తలా దూర్చేసి ఉండడమే!

సెల్ ఫోన్లు, దానివల్ల మారిన మనుషుల వ్యవహార సరళీ లాంటి విషయాల గురించి చదువుతున్నప్పుడు నాకు కనిపించింది ఓ వార్త. అమెరికాలోని ఐయోవా రాష్ట్రంలో ఇలాంటి పద్ధతి ప్రవేశ పెట్టారని చదివాకా ఆసక్తి గా అనిపించింది. ఆతర్వాత సింగపూర్ లో కూడా ఉందని ఒక మిత్రుడి ద్వారా తెలిసింది. ‘ఎంత మంచి ఆలోచన!’ అనిపించింది.

మనసారా, కరువుతీరా మాట్లాడుకోగలగడం మనిషికి మాత్రమే దొరికిన గొప్ప వరం. అది మనల్ని ప్రేమించే కుటుంబంతో గానీ, ప్రాణ స్నేహితులతో గాని అయితే ఇంకెంత ఆనందమో! అది లేనివాళ్ళకే, లేనప్పుడే తెలుస్తుంది.” అన్నాడు మెత్తగా.

చిన్న కంపన అతని స్వరంలో.

“ఇది నాకు ఇప్పుడు అనిపించినది కాదు, నాకు ఊహ తెలిసినప్పటినించీ అనిపిస్తున్నదే! కారణం నాకంటూ ప్రత్యేకంగా ఫేమిలీ లేకపోవడమే. కారణాలేమైతేనేం ? నా కుటుంబం అంటే కేవలం అమ్మా, నేనే!

పేదరికం లో పుట్టాను నేను. అది ప్రాబ్లెం కాదు. నాన్న నేను పుట్టక మునుపే పోయాడు. అమ్మ తపనంతా నన్నెలా పెంచాలా అన్నదే, దానికావిడ చెయ్యని పని లేదు. నన్ను మా పక్కింటి ఆవిడ చూసుకునేది నన్ను. చూసుకోవడం అంటే స్కూల్ నించి వచ్చాకా ఆవిడ తన పిల్లలతో పాటు ఓ చిన్న గ్లాస్ టీ ఇచ్చేది, ఒక బన్నో, రొట్టో పెట్టేది. దానికి అమ్మ దగ్గరనుంచి నెలకింతని డబ్బు తీసుకునేది

పొద్దున్నే అమ్మతో పాటుగా స్కూల్ కి వెళ్ళేవాడిని, దగ్గరలోని చిన్న గవర్నమెంట్ స్కూల్ మాది. వచ్చాకా వాళ్ళ పిల్లలిద్దరూ ఆడుకునేవారు, నన్ను ఆడిగేవారు కాదు, నేనూ వెళ్ళేవాడిని కాదు. పక్క తలుపే కనక గుమ్మంలో కూర్చుని అమ్మ కోసం ఎదురుచూసేవాణ్ణి. అంతలోనే నాకొచ్చిన రీతిలో, అర్ధమయినంతలో స్కూల్ వర్క్ చేసుకునేవాడిని.

చీకటి పడుతూ ఉండగా అమ్మ దగ్గరలోని గార్మెంట్ ఫేక్టరీలో పని ముగించుకుని వచ్చేది. ఆపైన అన్నం వండేది. ఆ వేడి అన్నంలో చింతకాయో, పండు మిరపకాయ తొక్కో వేసుని తినేవాళ్ళం. గిన్నెలు కడిగి, నీళ్ళు పట్టుకుని పక్కలు వేసేది అమ్మ. పొద్దున్నించీ పని చేసి అలసిపోయిన అమ్మ వెంటనే నిద్రలోకి జారుకునేది.

నేను చిన్నప్పుడు పడుకునేవాడినేమో నాకు తెలీదు కానీ దాదాపు పదేళ్ళ వయసునించీ త్వరగా నిద్రపోయేవాడిని కాదు. అమ్మనే చూస్తూ ఆలోచించేవాడిని. ఇవీ అని చెప్పలేని ఆలోచనలు నా మనసంతా ముసురుకునేవి. కొన్ని నన్ను కలవర పెట్టేవి, కొన్ని భయపెట్టేవి.

మాకున్న ఒక్క గది, ఆ నాపరాళ్ళతో చేసిన నేల, దానిమీద చాపలూ, బొంతలూ.. పైన చుట్టూ ఉన్న చిన్న అటక, దానిమీదున్న ఒకే ఒక ట్రంక్ పెట్టె. ఇవన్నీ చూస్తూ ఉండేవాడిని బాగా నిద్ర వచ్చేవరకూ. కరంట్ బిల్ కి కావలసిన డబ్బు ఇవ్వడం ఆలస్యమైతే ఇంటి యజమానే ఫ్యూజ్ తీసేసేవాడు. మళ్ళీ జీతం వచ్చేవరకూ చిన్న దీపంతో గడిపేవాళ్ళం. ఆ నాలుగైదు రోజులూ నేను వెలుగుండగానే కావలసినవి చదువుకునేవాడిని.

" చిన్నా, ఏం చేశావ్ స్కూల్ నించి వచ్చాకా? చదువుకున్నావా? అన్నం తిందూ రా! లేట్ అయింది ఇంక పడుకో!" ఇవే మా అమ్మ నాతో ఎక్కువగా మాట్లాడే మాటలు.

తన మనసులో ఏం దిగులుండేదో నాకప్పుడు చిన్న వయసువల్ల తెలీదు, ఆవిడ ఎప్పుడూ చెప్పలేదు కనక. ఇప్పుడు వయసొచ్చినా తెలీదు అమ్మ లేదు కనక.. ఏదో మిషన్ లో పెట్టి, మీట నొక్కితే పగలూ, రాత్రి ఒక చక్రంలా, క్రమం తప్పకుండా తిరిగితే ఎలా ఉంటుందో? అలాగే ఉండేది మా జీవితం.

మొదటినించీ నాస్వభావమే అనుకోవాలో, లేక నా పరిస్థితుల వల్ల అలవడినదో తెలీదు నేను ఎక్కువగా ఒంటరిగా ఉండేవాడిని. నా పనేదో,నేనేమో అన్నట్టుగా ఉండే నాకు స్నేహితులు తక్కువే. చదువులో నేను చురుగ్గా ఉండడం వల్ల, నా స్కూల్ మేస్టర్లు ఇద్దరు నన్నెంతో ప్రోత్సహించేవారు. నేను కాలేజీకి వచ్చేంతవరకూ ఎవరితోనైనా మాట్లాడానంటే అది వారిద్దరితోనే. పాపం నాకోసం స్కూల్ ఫీజులు నెలకొకరు చొప్పున కట్టేవారు. దానికి ప్రతిగా వారడక్కపోయినా అమ్మా, నేనూ వాళ్ళిళ్ళల్లో ఏదైనా పని ఉంటే చేసేవాళ్ళం.

అందరికీ సరదాగా మరపురానిదిగా ఉండే కాలేజీ జీవితం కూడా నాకు ఓ గొప్ప అనుభవమే. ప్రతీ క్షణం కష్టపడుతూ, తర్వాత సెమెస్టర్ కి ఫీజ్ ఎలా? అనుకుంటూ గడిపినదే. అదృష్టవశాత్తూ స్కాలర్షిప్ వచ్చేది కనక కొంతవరకూ గడిపేవాడిని. మిగతా లోటు పూరించడానికి ఏదో ఒక పని చెయ్యవలసి రావడం వల్ల ఖాళీ సమయం అంటూ ఉండేది కాదు.

నేను ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ లో ఉన్నప్పుడు అమ్మకి పెద్ద జబ్బు చేసింది. దాన్నప్పుడు కేన్సర్ అంటారని కూడా చాలా రోజులవరకూ మాకు తెలీదు. తెలిసేసరికి సమయం మించిపోయింది. అమ్మ ఇంక ఎంతో కాలం బ్రతకదు! అని తెలిసిన రోజు ఏం చెయ్యాలో తెలీలేదు .

అమ్మని బ్రతికించుకోలేకపోతున్నానని నేను, నా బ్రతుకుని పూర్తిగా చూడలేకపోతానని అమ్మా ఒకేసారి కీ ఇచ్చిన రెండు బొమ్మల్లా ఒకేసారి ఏడ్చాం. ఆరోజే అమ్మ నాతో మనసారా మాట్లాడింది, తన గురించీ, చిన్న రచయిత అయిన నాన్న గురించి, సినిమా రంగంలో రాణించాలన్న

ఆయన తీరని కల గురించీ, ఎక్కడో మొదలై ఎక్కడో తేలిన తమ జీవితాల గురించీ. ఇలా చాలా చెప్పింది. ఆ తర్వాత చెప్పలేనని తెలుసిపోయిందేమో! తను పడ్డ కష్టాలని గురించి కానీ, తన మనసులోని దిగులు గురించికానీ చెప్పలేదు.

ఎవరికోసం ఎవరు బాధ పడినా ఆగని కాలం ఎవరినీ స్పేర్ చెయ్యదు.. మరో నాలుగు రోజుల్లో అమ్మ నన్ను వదిలి వెళ్ళిపోయింది." శ్రేయస్ తడి కళ్ళు ఆ రెస్టారెంట్ యొక్క మసక వెలుగుల్లో కూడా మెరుస్తున్నాయి.

భువన్ అతని చేతిని పట్టుకున్నాడు. నవ్య కూడా అనునయంగా ' శ్రేయస్, ఈజీ" అంది.

" ఐ యాం ఓకే నౌ! కొద్దిగా ఇమోషనల్ అయిన మాట నిజమే! కానీ నా కథా, దానిలోని కష్టాలూ చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. మన మాట పంచుకోవడం అనేది మనకెంత అవసరమో, దానికి మనవాళ్ళు అనేవారు నలుగురు ఉండడం ఎంత ముఖ్యమో చెప్పడానికే ఇదంతా చెప్పాను. అది లేకపోవడం అంటే ఏమిటోనేను ప్రత్యక్షంగా అనుభవించాను కనక నాకు బాగా తెలుసు.

నా లాంటి పరిస్థితులు అందరికీ ఉంటాయని గానీ, ఉండాలని కానీ కాదు. ఇలాంటి పరిస్థితులెవరికీ రాకూడదని మనసారా కోరుకుంటాను ఎప్పటికీ.

ప్రతీ క్షణం నాకోసం తపన పడిన అమ్మకీ, ఆవిడ నా కోసం పడుతున్న కష్టానికి సార్ధకత చేకూర్చాలన్న నాకూ కూడా ఎప్పుడూ కాలం అమూల్యమే! దాన్నెప్పుడూ కబుర్లతో కరిగించేంత సమయం కనీ, అవకాశం కానీ లభించనే లేదు అనే చెప్పాలి. అందుకే కుటుంబం ఉండడం, కావలసిన వారు నలుగురుండడం లోని ఆనందం నాకంటే మరెవరికి ఎక్కువ తెలుస్తుంది? అమెరికాలోని రెస్టారెంట్ లో ఈ పద్ధతి గురించి చదివినప్పుడు నా మనసులో మెదిలిన భావాలివి.

మొదట్లో మనకి దొరికిన వరాల్లా మొదలయిన మొబైల్ ఫోన్ లు మనకి తెలీకుండానే ఎంత కాలాన్ని మిగేస్తున్నాయో మనకు తెలుసు. ఫోన్ కాల్స్, వాట్స్ ఆప్ మెసేజ్ లు, ఫేస్ బుక్ లో గడిపే సమయాలు, సెల్ఫీలు, వాటివల్ల కలుగుతున్న నష్టాలు.. ఇలా లిస్ట్ రాసుకుంటూ పోవచ్చు. అన్నింటికన్నా ముఖ్యంగా జనం ప్రశాంతంగా భోజం చెయ్యడం లేదు, నిద్ర పోవడం లేదు. ఇవి అన్నింటికంటే బాధాకరమైన విషయాలు.

అందమైన కుటుంబంతో చక్కటి సాయంత్రం ఆహ్లాదంగా గడపాలి. అంతకన్నా అదృష్టం ఉంటుందా నిజానికి? కానీ ఎవరి మానాన వారు ఫోన్ల లోకి చూస్తూ కూర్చుని తింటూ ఉంటే అదేం ఆనందం? నాలాంటివాడికెలాగూ అలాంటి అదృష్టం లేదు, ఉన్నవాళ్ళు కూడా దానికెందుకు దూరం అవ్వాలి? అన్న ఆలోచన నన్ను బాగా కదిలించింది.

మనం కూడా ప్రయత్నిస్తే? అన్న ఊహ వచ్చింది. అందుకే ఈ బోర్డ్ తయారు చేయించాను. ప్రపంచం నలుమూలలా ఎన్నో రకాలైన కొత్త పద్ధతులతో, ఆలోచనలతో వచ్చేవారిని ఆకట్టుకునే ప్రయత్నాలు అనేక రెస్టారెంట్స్ చేస్తున్నాయి. 'మనం ఇదెందుకు చెయ్యకూడదు? ' అనిపించింది నాకు. అందుకే మీ ఇద్దరితో చెప్పకుండానే ఒక సాంపిల్ బోర్డ్ తయారు చేయించాను. భువన్ చెప్పినట్టు ఇది పూర్తిగా వారి ఛాయిస్, మన బలవంతం ఏమీ లేదు.

మీ ఇద్దరికీ కూడా నచ్చితే మనం కూడా ఈ ఆలోచనని అమలు పెడదాం. మొబైల్ కంపెనీ వాళ్ళు ' మాట్లాడండి, మాట్లాడండి, ఫోన్ లలోఇంకా మాట్లాడదండీ అంటారు రక రకాల ఆఫర్ లని ప్రవేశ పెడుతూ.. మనమూ అదే అంటాం కానీ మనం మాట్లాడమనేది మనసైన వారితో, మనసారా నవ్వుతూ. నా ఊహ నిజమైతే త్వరలోనే చాలా మంది దీని విలువ గుర్తిస్తారు. మన ఆలోచన వల్ల కొందరిలోనైనా మార్పు వస్తే అంతకంటే కావలసినదేమిటి?"అన్నాడు

అతని మాటల్లోని నిజాన్ని గుర్తించిన మిత్రులిద్దరూ తల ఊపారు సమ్మతిని సూచిస్తూ..

COMMENTS